# జగమేలే పరమాత్మా ఎవరితో మొరలిడుదు

శ్రీనివాసమూర్తి కత్తిమీద సాము చేయగలనని చెప్పడం మాత్రమేకాదు, కత్తివాదర మీద నడిచి నిరూపిస్తున్నాడు కూడా! వ్రతంలో దాదాపు ముప్పాతిక వంతు నిర్విఘ్నంగా నెరివేరినట్టే లెక్క. కార్యక్రమం ఇంకొక అరగంటలో పూర్తి కావచ్చు. ప్రస్తుతం శాస్త్రిగారు 'నగు మోము గనలేని తన జాతిని గురించి' పరాత్పరుడికి తెల్పుకుంటూ, నిశ్చల కాసారంలో గులకరాయి పడడం వల్ల అలలు క్రమక్రమంగా పెద్దవై అంచులదాకా విస్తరించినట్టుగా, ఆభేరి రాగంపైన భేరిధ్వనుల తరంగాలను సృష్టిస్తున్నారు. రెండు గంటల సేపటి నుంచి కొనసాగుతున్న కచ్చేరీ ఒక స్థాయీభావంలోకి వచ్చేసినట్టు సభ అంతా ఒక నిశ్చలమైన చిత్తరువులా స్తంభించిపోయింది. సైడ్ కర్టెన్ అవతల స్తంభానికి అనుకుని పోతపోసిన విగ్రహంలా నిల్చున్న 'రసతరంగిణి' కార్యదర్శి శ్రీనివాసమూర్తి పాత్రనిర్వహణలో తానప్పటివరకు తీసుకున్న మెలకువలను గురించి, ఇకమీదట తీసుకోవలసిన జాగ్రత్తల్ని గురించి తలపోసి చూసుకుంటున్నాడు.

ఆనాటి సాయంకాలం నాలుగున్నర గంటలప్పుడు స్టేషనులోకి వచ్చి ఆగిన ఎక్స్‌ప్రెస్ బండిలోని ఒక ఫస్టు క్లాసు కంపార్టుమెంటులో నుంచి దిగి, దర్పాన్ని ప్రకటించే చూపుల్తో ప్లాట్‌ఫారాన్ని సర్వేచేస్తూ నిల్చున్న దేవకోట అనంతనారాయణ శాస్త్రిగారి మెడలో ట్రిక్ ఫోటోగ్రఫీలో తనంతట తానుగా వచ్చి దివ్య పురుషుడి కంఠంలో పడబోయే హారంలా ఏవైపు నుంచి వచ్చిందో, ఎలా వచ్చిందో తెలియకుండా నిండైన గులాబీ దండ ఒకటి వచ్చి పడిపోయింది. దూర దూరాలకు ప్రసరిస్తున్న చూపుల్ని శాస్త్రిగారు తమ చెంతకు లాక్కునేటప్పటికి అవనత శిరస్కుడై ముకుళిత హస్తుడై ఎట్టయెదుట నిల్చున్న శ్రీనివాసమూర్తి కనిపించాడు.

"రసతరంగిణి కార్యదర్శి మీరేనా?" శాస్త్రిగారి పలకరింపు కూడా త్యాగరాయ కీర్తనల్లోని ఒక పల్లవిలాగే వినవచ్చింది.

"అవునండీ, నేనే" అన్నట్టుగా శ్రీనివాసమూర్తి తలాడించాడు.

ఈలోగా ఎక్కడో జనరల్ కంపార్ట్‌మెంటులో కూర్చున్న శాస్త్రిగారి నౌకరు కుప్పుసామి పరుగెత్తుకుంటూ వచ్చి కంపార్టుమెంటులో నుంచి పెట్టె క్రిందికి దించేశాడు!

మహారాజుగారికి "ఇటు, ఇటు" అంటూ దారిచూపే కంచుకిలా శ్రీనివాసమూర్తి ముందు నడవగా, అతడి వెనుక శాస్త్రిగారు, ఆయన వెంట నౌకరు కుప్పుసామి స్టేషనులో నుంచి ఈవలికి వచ్చారు. "వాకిటనే పదిలముగా వాతాత్మజుడు" అన్నట్టుగా అక్కడ కారు సిద్ధంగా వుంది.

బస ఏర్పాటు చేసింది కూడా హోటల్లో గీటల్లో కాదు. ఆర్ అండ్ బి వారి టి.బి.లో ప్రత్యేకగారం. మంచంపైన మెత్తటి పరుపు, మల్లెపువ్వులాంటి దుప్పటి, పొందికైన

తలగడ, చుట్టూ దోమతెర, సుఖాసనాలు, బాత్‌రూంలో వాష్‌బేసిన్ దగ్గర పార్సెల్ విప్పని సోపు, స్టాండుకు మడత చెరగని టవలు, హాల్లో అగరొత్తుల పరిమళాలు.

స్నానం చేసి ఈవలికి రాగానే, ప్రత్యేకంగా పురమాయించి నేతితో తయారుచేసి తెప్పించిన ఉపాహారం – తీపి తినుబండారాలతో సహా.

ఆఖరికి పాటలో ముక్తాయింపులా తాంబూలం, చెన్నూరు నుంచి తెప్పించిన తమలపాకులు, పొట్టులా తరిగిన పచ్చి వక్కలు తంగభస్మం పొగాకు.

ఏ విధంగా చూసినా వేలెత్తి చూపడానికి వీల్లేని ఉపచారాలై పోయాయి. "దొరుకునా ఇటువంటి సేవ" అని అనుకోవలసిన పరిస్థితి.

బుగ్గన దిట్టంగా తాంబూలం దట్టించిన శాస్త్రిగారు ఆరూ పదిహేనుకు కాలింగ్‌బెల్ నొక్కి "ఏమయ్యా కార్యదర్శిగారూ! ఆరున్నరకే గదా ప్రోగ్రాము?" అని అడిగారు.

'చిత్తం చిత్తం' అన్నట్టుగా శ్రీనివాసమూర్తి తల పంకించాడు.

అంగుళం వెడల్పున వెండి జరీ అంచు వచ్చిన కాంచీపురం పట్టు పంచెపైన ఈగ వాలినా జారిపోయేటట్టున్న నగిషీల హొంబట్టు జుబ్బా తొడుక్కుని, కనకాంబరం రంగు కాశ్మీరు శాలువా భుజం పైనుంచి నిలువునా వేలాడేటట్టుగా వల్లెవాటు వేసి, కర్ణకుండలాలతో, గండపెండేరంతో, కరకంకణాలతో, రవ్వల అంగుళీయకాలతో, వినతాసుత వాహనుడై వెడలిన కోదండపాణిని తలపిస్తూ శాస్త్రిగారు కారులో అధివసించారు.

హాలు దగ్గర కూడా స్వాగత సత్కారాలకు కొదవేమీ లేదు. పక్కబలంగా వచ్చిన వాళ్ళు కూడ సంగీత విద్యా విశారదులే. ఆకాశవాణిలో పనిచేసి పదవీ విరమణ పొందిన కర్పూరపు సూరిబాబుగారు వయొలిన్. లయవిన్యాసకోవిద కోడూరు లింగప్పగారు మృదంగం. ఇక ఘట విద్వాంసుడేమో శ్రీరంగపురం సంతానమయ్యరు కచ్చేరీల్లో పాల్గొన్న ఘటికుడు మేల్పాడి పరమశివం. ఈ ముగ్గురితో కలసి అనంత నారాయణ శాస్త్రిగారు వేదికపైన కొలువమరేసరికి జనంతో క్రిక్కిరిసిపోయి ఉన్న సభ తంత్రులు బాగా బిగించిన జంత్ర వాద్యంలా నాద సుధా రసపానానికి సిద్ధంగా వుంది.

రసతరంగిణి అధ్యక్షుడు, రిటైర్డ్ శిరస్తాదారు కలిదిండి పున్నారావు జాగ్రత్తగా వ్రాసుకొచ్చిన వాక్యాలతో పరిచయ కార్యక్రమం పూర్తిచేశారు.

"దేవకోట అనంత నారాయణ శాస్త్రిగారి జన్మస్థలం తిరువేలంగాడు. ఒకప్పుడది చిత్తూరు జిల్లాలో ఉంది, పటాస్కర్ కమిషన్ నిర్ణయం మేరకు తమిళనాడుకు బదలీ అయింది. అందువల్ల మదరాసు నగరంలో స్థిరపడినప్పటికీ శాస్త్రిగారు తెలుగువారిక్రిందే లెక్క. వీణ కుప్పయ్య వంశానికి చెందిన వీణ పద్మనాభయ్య దగ్గర శిష్యరికం చేసి శాస్త్రిగారు చాలా చిన్నవయసులోనే సంగీత వారాశిని ఔపోసనం పట్టారు. పన్నెండేళ్ళ ప్రాయం నుంచి కచ్చేరీలు చేస్తున్నారు. దక్షిణాదిలో ఆయన కచ్చేరీ చేయని పట్టణాలే లేవు. ఆకాశవాణి నిర్వహించే అఖిలభారత సంగీత కార్యక్రమాల్లో పెక్కుసార్లు పాల్గొన్నారు. అఖండ సన్మానాలందుకున్నారు. అనేక బిరుదులకు పాత్రులైనారు. అంతటివారు 'రసతరంగిణి' వంటి చిన్న సంస్థ ఆహ్వానాన్ని మన్నించి ఇక్కడికి రావడం మన అదృష్టం..."

పరిచయాలు పూర్తికాగానే శాస్త్రిగారు రాగాలాపన మొదలెట్టారు. హంస ధ్వనిలో వినాయక స్తవం... 'వినాయక విను వినాబ్రోచుటకు వేరెవరున్నారు'.

తొలి వేలుపుకు చెల్లించవలసిన మర్యాద చెల్లించేశాక సభావందనం చేయదలచుకున్నట్టుగా ఆయన పంచరత్న కీర్తన అందుకున్నారు-

"ఎందరో మహానుభావులు
అందరికీ వందనములు..."

హృదయారవిందంలో లోకేశ్వరుడి అంతరంగాన్ని దర్శించి బ్రహ్మానందం అనుభవించేవారికి, స్వాంతమనే సరోజాన్ని దేవదేవుడి పాదపూజ నిమిత్తం వినియోగించేవారికి, శ్రుతి, పురాణాలలోని మర్మాలను, షణ్మతాల గూఢార్థాలను గ్రహించి, భావ, రాగ, లయాదుల పరిజ్ఞానంతో చిరాయువు కలిగి సుఖాతిశయాలతో అతిశయిల్లే వారికి ఇలా వరుసగా అందరికీ వందనాలు చెల్లించిన తర్వాత, నల్లేరుపైన బండి నడిపించినట్టుగా పద కవితా పితామహుడి పాటలు రెండు పాడి వినిపించి, ఆపైన తూము నరసింహదాసు కీర్తనలు రెండు ఆలాపించి, స్వాతి తిరునాళ్ జావళీ ఒకటి గానం చేసి, మళ్ళీ ఆయన త్యాగబ్రహ్మ గాన సామ్రాజ్యంలోకే తరలివచ్చేశారు.

"శాంతము లేక సౌఖ్యము లేదు
సారసదళ నయనా!
దాంతునికైన, వేదాంతునికైన..."

వాక్కుల సముదాయమే వాఙ్మయం. నిఘంటువులు తెరిచి చూస్తే వేలకొలది పదాలు కనిపిస్తాయి. వట్టి అక్షరాల కలయికగా ఉన్నంత వరకు పదం వెలగని విద్యుద్దీపం లాంటిదే! ఏ పదానికైనా జీవం రావటం ఉచ్చారణ వల్లనే. అయితే, మాటలు ఒక్కొక్కరి నోట ఒక్కొక్క రకంగా వినిపిస్తాయి. కొందరి ప్రసంగం గంభీరంగా వుంటుంది. కొందరి సంభాషణ పేలవంగా వుంటుంది. కొందరు మాట్లాడుతుంటే తలపైన సుత్తితో కొట్టినట్టు కర్ణకఠోరంగా వుంటుంది. కొందరు మాట్లాడుతుంటే ఇంకా మరికొంతసేపు వినాలన్నంత కర్ణరసాయనంగా వుంటుంది. కొందరివి చిలక పలుకులైతే, కొందరివి నెమలి క్రేంకారాల్లా వుంటాయి. అయితే, అన్నింటిలోనూ వేణువులా, వీణలా, నాదస్వరంలా ఏ స్థాయిలోనైనా అత్యంత మధురంగా ఉండేది జీవితమంతా సాధన చేసిన గాయకోత్తముల కంఠస్వరమే. అనంతనారాయణ శాస్త్రిగారి స్వరపేటిక దానికదే ఒక సంగీత వాద్యంలా వుంది. అందులో నుంచి వెలువడిన ప్రతి స్వరమూ ఆపాతమధురమైన ఒక సంగీత తరంగంలాగే ఉంది. అందులో నుంచి వెలువడిన ప్రతి మాటా నిండుగా ప్రాణాలు పోసుకుని ఒక మంత్ర శబ్దంలాగే వినవస్తోంది.

శ్రోతలందరూ చెక్కి కూచోబెట్టిన చెక్కబొమ్మలు!

అవును. శాంతము లేక సౌఖ్యము లేదు. ఇది రాజులకైనా, కవిరాజుల కైనా మునిరాజులకైనా సమానంగా వర్తించే మాట.

"దారసుతులు ధనధాన్యములుండిన
సారెకు జపతప సంపద కలిగిన

ఆగమ శాస్త్రములన్నియు చదివిన
భాగవతులనుచు బాగుగ పేరైన..."
ఏమైనాసరే! ఎంతవారలైనా సరే, శాంతము లేక సౌఖ్యము లేదు.

భృగు మహర్షి ఉరోభాగంలో తన్నినా విష్ణుదేవుడు కోప్పడలేదు. కౌరవులు ఎన్ని దురన్యాయాలు చేసినా ధర్మరాజు కోపించుకోలేదు. గయ్యాళి భార్య తలపైన కడివెడు నీళ్ళు కుమ్మరించినా సోక్రటీసుకు కోపం రాలేదు. త్యాగయ్య గారు మాత్రం? ఆయన ప్రాణాధికంగా భావించి, ఆరాధించుకునే సీతారామ లక్ష్మణుల విగ్రహాలను తీసుకెళ్ళి అన్న జపేశుడు నదీజలాలలో పారేశాడు. త్యాగరాజు దుఃఖించాడే గానీ దురుసుగా ఒక మాట అనలేదు. 'హరి, నేనెందుకు వెదుకురా' అని ఆక్రోశించాడే గానీ, ఆగ్రహలేశమైనా ప్రకటించలేదు. అందువల్ల శాంతము లేక సౌఖ్యము లేదు అన్నది త్యాగరాజు నాలుక చివరినుంచి ఊడిపడిన మాట అయి ఉండదు. నిస్సందేహంగా అంతరంగం నుంచి పెల్లుబికి వచ్చిన మాట అయి వుంటుంది. అది ఒక కాలానికి, ఒక దేశానికి సంబంధించిన మాట కాదు. సర్వకాలాలకు, సర్వదేశాలకు చెందిన శాశ్వత సత్యం. అర్ధ నిమీలిత నేత్రాలతో మైమరచి వింటున్న శ్రోతలకది అనంత నారాయణ శాస్త్రిగారు పాడుతున్న పాటలాలేదు. కావేరీ తీరంలో, సాంద్రవృక్ష చ్ఛాయలో కూర్చుని త్యాగయ్యగారు ఆలపిస్తున్న కీర్తనలాగే వుంది.

ఈత నేర్చినవాడికి త్యాగరాజగాన సుధాంబుధిలో ఎన్నెన్ని అనర్ఘ రత్నాలైనా లభిస్తాయి. శాస్త్రిగారీసారి మరొక అమూల్య రత్నాన్ని ఒడిసి పట్టుకున్నారు. ఇదివరకు పాడింది స్టేట్‌మెంటు అయితే, ఇప్పుడు మొదలెట్టింది ప్రశ్న. ఇందులో త్యాగరాజుగారు బదులు చెప్పవలసిందిగా తన మనసును తానే అర్థిస్తూ 'నిధి చాల సుఖమా, రాముని సన్నిధి సేవా సుఖమా' అని ప్రశ్నిస్తున్నారు. ధన కనక వస్తు వాహనాలంటే ఆయనకు తృణప్రాయం. శ్రీరాముని సేవచేసే భాగ్యమే ఆయనకు పెన్నిధి. కమ్మని అనుబంధాలపైన ఆయనకు మక్కువ లేదు. నిరంతర భగవత్సంకీర్తనం పట్లనే ఆయనకు ధ్యాస.

అలాగని నాస్తిక భావం కన్నా ఆస్తికత గొప్పదని గానీ, ధనార్జన పట్ల బొత్తిగా ఆసక్తి కలిగి ఉండరాదని గానీ అనుకోనక్కర్లేదు. తాను ప్రవచించిన సిద్ధాంతాలకు త్యాగయ్యగారు ఎంతవరకు అంటిపెట్టుకో గలిగారన్నదే ముఖ్యమైన విషయం. ఎందరో ప్రభువులు, శ్రీమంతులు త్యాగరాజు గానామృతాన్ని తనివితీరా గ్రోలి, పరవశించి ఆయనకేదైనా ఉపకారం చేయాలనుకున్నారు. సన్మానాలు చేద్దామంటే ఆయన ఒప్పుకోడు. డబ్బిస్తే తీసుకోడు. 'మరెట్లా? చేతిలో పైసా లేకుండా నిజదార సుతోదర పోషణ ఆయనకెలా సాధ్యమైంది?' అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. ఉదయకాలపు అనుష్ఠానాలన్నీ ముగిసిన తర్వాత ఆయన నాలుగు వీధులూ తిరిగొచ్చేసరికి చేతిలోని భిక్షపాత్ర నిండిపోయేది. ఆ బియ్యంతో రోజు గడిచిపోయేది.

'దమశమమను గంగా స్నానము సుఖమో'క
ర్ధమ దుర్విషమ కూప స్నానము సుఖమో
మమత బంధనాయుత నరస్తుతి సుఖమో
సుమతి త్యాగరాజ సుతుని కీర్తన సుఖమో.

ఏ పరలోకాలనుంచో దిగివచ్చి త్యాగరాజు ఆత్మ తనను ఆవేశించినంత అర్థవంతంగా శాస్త్రిగారు గీతాలాపన చేస్తున్నారు. సభలో ఇప్పుడు మిగిలి ఉన్నదల్లా కర్ణామృతమైన గానమూ, దానినాస్వాదించే సభికుల సూక్ష్మశరీరాలూ మాత్రమే. సంగీత విద్యా ప్రదర్శనం ఆ స్థాయికి చేరుకున్నాక ఆయన కచ్చేరీ కంతా శిఖరాయమానంగా మరొక సుప్రసిద్ధ త్యాగరాయ కీర్తన అందుకున్నారు.

"నగుమోము గనలేని నా జాలి తెలిసి
నను బ్రోవ రాదా, శ్రీ రఘువరా..."

ప్రవాహం ఆనకట్ట దగ్గర ఆగిపోయినట్టుగా, రెండు గంటల సేపటి నుంచి కొనసాగుతున్న కచ్చేరీ ఈ పాట దగ్గరే ఆగిపోయింది.

"ఖగరాజు నీ ఆనతి విని వేగమె చనలేదో
గగనానికి ఇలకు కడుదూరంబనినాడో
జగమేలే పరమాత్మా!
ఎవరితో మొరలిడదు...."

ఆనకట్ట దగ్గర కూడా నీరు ఒక మట్టం దాకా పెల్లుబికిన తర్వాత తూము తలుపులు తీసేస్తారు. అప్పుడిక తెరిచిన తూము గుండా నీరు మరింత ఉరవడిగా తొండాలతో చిమ్మినట్టు క్రిందికి దూకుతుంది. 'జగమేలే పరమాత్మా' అన్న సంబోధన దగ్గిరికి వచ్చేసరికి, పాట కచ్చేరీ కూడా ఆ స్థితికి వచ్చేసింది.

అయితే, ఒకటి త్యాగరాజుదంతా ఆత్మవిచారం. స్వామి నగుమోము కనిపించలేదన్నదే ఆయన ఆవేదన. కానీ, చెలమ తీసిన కొద్దీ నీళ్లూరినట్టుగా, కాలం గడిచినకొద్దీ అదే మాటకు ఎన్నెన్నో కొత్త అర్థాలు స్ఫురిస్తున్నాయి.

బిడ్డ తనకేదైనా అవజ్ఞ జరిగితే తల్లితో చెప్పుకుంటాడు. శిష్యుడు తనకేదైనా ఇబ్బందులేర్పడితే గురువుతో చెప్పుకుంటాడు. సివిల్, క్రిమినల్ తగాదాలు పరిష్కరించడానికి సుప్రీంకోర్టు దాకా వివిధ న్యాయస్థానాలున్నాయి. అయితే తల్లిదండ్రులుగానీ, సంఘనేతలు గానీ, న్యాయస్థానాలు గానీ నివారించలేని అస్తవ్యస్త పరిస్థితులు సమాజంలో ఉన్నప్పుడు మానవుడు తన సొదనంతా ఎవరి దగ్గర వెళ్ళ బోసుకుంటాడు? అలాంటి సందర్భాల్లో ఆస్తికులైనా వారికి ఆలించినా, పాలించినా భగవంతు డొకడే ఏడుగడగా కనపిస్తాడు. "స్వామీ! సమాజం ఉండవలసిన తీరుకు, వున్న తీరుకు గగనానికీ నేలకూ ఉన్నంత అంతరం ఏర్పడిపోయింది. మాటలకు, చేతలకు పొంతన వుండడం లేదు. సేవ అనే ముసుగు క్రింద స్వార్థం బుసటు కొడుతోంది. మూర్ఖులు సభాపూజ్యులై పోయారు. అవినీతిపరులకే అగ్రపీఠాలు లభిస్తున్నాయి. మంచివాళ్లు అప్రయోజకులైపోయారు. గూండాలు హీరోలుగా చలామణి అవుతున్నారు. ప్రజాస్వామ్యం పట్టి నేతి బీరకాయ చందమైపోయింది. కంచెలే చేలు మేస్తున్నాయి. విధ్వంసక కృత్యాలు పెట్రేగిపోతున్నాయి. కళలు వ్యాపార ధోరణికి దాస్యం చేస్తున్నాయి. జగన్నాయకా! ఈ విపర్యయాన్ని గురించి నేనెవరితో చెప్పుకోను? నువ్వే వినిపించుకోకపోతే మరెవరు వినిపించుకుంటారు?

మంగళంతో ఇక కార్యక్రమం పూర్తికావడమే తరువాయి. ఆ వ్యవధిలో మునిసిపల్ చైర్మన్‌గారు శాలువా కప్పి, మెమెంటో సమర్పించి, చందన పుష్పతాంబూలాదులతో

సహా నగదు పారితోషికాన్ని శాస్త్రిగారికి అందజేశారు. సత్కారం నెరపిన తర్వాత "ఇప్పుడు సన్మానపత్ర బహూకరణ" అంటూ సెలవు తీసుకున్నారు.

స్వర్ణకాంతుల జిలుగుతో మెరిసిపోతున్న వెడల్పాటి ఫ్రేముతో బిగించిన భారీసైజు సన్మాన పత్రాన్ని రెండు చేతులతోను పదిలంగా పట్టుకున్న శ్రీనివాసమూర్తి అద్దంలోకి నీడ ప్రవేశించినంత నిశ్శబ్దంగా సైడ్ కర్టెన్ వెనుకనుంచి రంగస్థలం పైకి వచ్చి మైకు ముందు నిలబడ్డాడు. చాలా తక్కువగా మాట్లాడుతాడంటూ మూర్తి పట్ల అభిజ్ఞ వర్గాల్లో ఓ ఆరోపణ ఉంది. అయితే, అతడు మాట్లాడుతూ వుంటే మరికొంతసేపు వినాలనిపిస్తుంది. గొంతు సవరించుకుని, బిరుదులన్నీ పూర్తయ్యాక "శ్రీయుతులు దేవకోట అనంత నారాయణ శాస్త్రిగారికి రసతరంగిణి సమర్పించిన సన్మానపత్రం" అంటూ హెడ్డింగ్ చదివి వినిపించి, గాయక శిరోమణీ, గాంధర్వ విద్యా పయోనిధీ, సంగీత జ్ఞాన మహార్ణవాలాంటి సంబోధనలు గుప్పిస్తూ శ్రీనివాసమూర్తి పత్ర పఠనం కొనసాగిస్తుంటే ప్రేక్షకులతడి వైపు కన్నార్పకుండా చూస్తూ వుండిపోయారు. వాళ్ళు ఊపిరి తిప్పుకునే సరికే అతడు సన్మానపత్రంలో సగం ముప్పాతిక దూరం సాగిపోయాడు.

"....నిత్య నిరంతర నాదోపాసన కళాధురీణా! మీకివే మా జేజేలు. మహిత సంగీత సాధనే యాగంగా, యోగంగా, భోగంగా బతుకును పండించుకున్న సార్ధకజన్ములు మీరు! ప్రణవనాదానికి వ్యాఖ్యాన ప్రాయమైన గీతంలో, గీతాలాపనలో అడుగడుగునా నర్తించే లయలో, లయలోనుంచి ఉద్భవించే మహదానందంలో ఓలలాడే మహానుభావులు మీరు! రాగాల పూలతెప్పల్లో శ్రోతల్ని రసానందలోకాలకు తీసుకొని వెళ్ళగల గాన వైదుష్యం మీ సొమ్ము. అందాల సరసిలో రాయంచ ఒయారాలు పోతూ విహరించినట్టుగా, సుందర నందనవనంలో మలుపులు తిరిగే సందుల వెంట తుమ్మెద బాలుదు మెలకువలు కనబరుస్తూ పుష్పరథం తోలినట్టుగా, పచ్చిక మైదానంలో హరిణ శాబకం ఉల్లాసంగా గంతులువేస్తూ పరుగులు తీసినట్టుగా, కొండవాలున సెలయేరు పడుతూ లేస్తూ, వంపులు తిరుగుతూ ఉరవళ్ళు పెడుతూ వెయ్యి విన్యాసాలు నెరపినట్టుగా, సంగీత విద్యాపాటవాన్ని అదొక అసమాన హేలగా, ఆహ్లాదలీలగా ప్రదర్శించగల గాయక సార్వభౌములు మీరు! సర్వ రాగాలకు కొలువు మీ హజారం. శివరంజని మీ వశవర్తిని. కల్యాణి మీ రాణి, సురటి మీ ఇంటి చేటి. శంకరాభరణం మీ ముంజేతి కంకణం. తోడి మీ సైదోడు..."

ఆ పనితో అవసరమున్న వాళ్ళందరూ కలిసి కూడబలుక్కున్నట్టుగా, సన్మాన పత్రాలు సిద్ధం చేయడంలో ఒక సంప్రదాయం ఏర్పడి పోయింది. వాస్తవానికి అంటిపెట్టుకోవాలన్న చాదస్తాన్ని కాస్త సడలించి, ఏరికోరి ఎన్నిక చేసిన పదాల పోహళింపుతో పన్నీరు చిలకరించినట్టుగా, పువ్వులు కురిపించినట్టుగా పొగడ్తలు రువ్వడం అందులోని ముఖ్యమైన లక్షణం. రసతరంగిణి వాళ్ళ సన్మానపత్ర మున్నూ అదే ఒరవడిపై సాగిపోయింది.

కుర్రాడి చేత కారియర్ ఎత్తించుకుని రాత్రి 9.30 గంటల ప్రాంతంలో శ్రీనివాసమూర్తి టి.బి. ప్రాంగణంలో అడుగు పెట్టేసరికి వాతావరణంలో మార్పు వచ్చేసినట్టు అతీంద్రియ శక్తి ఏదో చెప్పినట్టయింది. మూసిన తలుపుల కీవల కుప్పుసామి సిమెంటుతో

చేసిపెట్టిన బొమ్మలా నిలబడిపోయి వున్నాడు. కారులో శాస్త్రిగారిని తీసుకొచ్చి విడిదిలో దిగబెట్టిన నిడుముక్కుల చంద్రారావు క్రోటను మొక్కల వెనుక సిగరెట్టు కాల్చుకుంటూ వుండి, శ్రీనివాసమూర్తి కనిపించగానే గబగబా ఈవలికి రాసాగాడు. ఆలోగా కుప్పుసామికి కూడా కాళ్ళొచ్చేసాయి. నాలుగడుగుల్లో అతడు మూర్తిని సమీపించి "అయ్యగారు ఏలనో ఒకటే కోపంగా వుండారు సార్! చెప్పి మాళదు. గ్లాసు పీసులు తీసేద్దామని పోతే "అడె మడయా! పోడావెళియా" (ఒరే మొద్దూ! పోరా బయటా) అని కసిరినారు? అంటూ వున్న పరిస్థితిని పుటాక్షరాలతోనే నివేదించుకున్నాడు.

శ్రీనివాసమూర్తి హతాశుడైపోయాడు. శాస్త్రిగారిని త్యాగబ్రహ్మ రూపంలోనే సాగనంపెయ్యాలని అతడు శతవిధాలుగా ప్రయత్నించాడు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఫలితం దక్కలేదు. కుప్పుసామి మాటల్ని బట్టి చూస్తే ఇప్పుడాయన దుర్వాస మహర్షిగానే రూపాంతరం చెందినట్టున్నాడు.

చంద్రారావు ద్వారా మరిన్ని వివరాలు తెలిశాయి. మూర్తి చేతిని పట్టుకుని అతడు చరచరా ఓ స్తంభం చాటుకు లాక్కెళ్ళిపోయాడు.

"నాయనా శ్రీనివాసమూర్తీ! సింహంతోబాటు దాని గుహలోకి నన్ను కూడా పంపించేశావు గదటయ్యా బాబూ! నేను కనక కొంచెం ఆదమరిచి ఉంటే నమిలి మింగేసేవాడే! అయినా, ఈయనొక్కరేనా పైకప్పు ఎగిరిపోయేటట్టుగా అరవగలిగింది? ఆ మాత్రం పని మనకు చేతగాదా? ఎట్లాగు కచ్చేరీ జరిగిపోయింది గదా! ఇక ఇప్పుడు మనం ఎగరేసి మాట్లాడితే మాత్రం ఏం చేస్తాడు."

"ఇంతకూ ఏం జరిగిందయ్యా మహానుభావా!" కణతల్ని గట్టిగా అదిమి పట్టుకుని నేలచూపులు చూస్తూ ఆక్రోశించినట్టు అడిగాడు మూర్తి.

"నువ్వు కారెక్కించావా, మేమిక్కడ దిగామా..."

"అదంతా ఉండనీలే! అసలు సంగతి చెప్పు..."

"లోపలికి వెళ్ళగానే పూలదండా, మెమెంటో టేబిల్‌పైన పెట్టాను. సన్మాన పటాన్ని పదిలంగా గోడకానించాను. కుప్పుస్వామి మంచినీళ్ళు గ్లాసులోకి వంచి తీసుకు రాబోతున్నాడు. ఈ వ్యవధిలో కుర్చీలో కూర్చుని స్టూలు పైకి కాళ్లుసాచుకున్న అయ్యగారు కవరులోని నోట్లను ఎంచుకోడం కూడా పూర్తయింది. అంతేనయ్యా సంగతులు! "ఎక్కడయ్యా మీ సెక్రెటరీ? బుద్ధుందా అతడికి?" అంటూ గావుకేక వినిపించింది. నాకు మనసు చివుక్కుమంది. ఒళ్లు చరాలుమంది. అయినా, నన్ను నేనే నిలవరించుకుని "ఏమిటండీ?" అని అడిగాను. "అదేనయ్యా మీ సెక్రెటరీని గురించి! అతడికి బుద్ధుందా అని అడుగుతున్నా" అంటూ ముదలంకించుకున్నాడు. అప్పుడు నేనేదో కారుబారుచేసి వుంటానని నువ్వను కుంటున్నావేమో! అదేంలేదు నింపాదిగానే బదులందుకున్నాను. "అయ్యా, మీరు చెబుతున్న మాట వాస్తవమే. మా సెక్రెటరీకి బొత్తిగా బుద్ధి లేదు. బుద్ధి అనేది వుంటే కాలు మీద కాలు వేసుకుని ఇంట్లో కూచోలేక ఇలాంటి పనులు పెట్టుకునేవాడు కాదు. ఫస్టు క్లాసు చార్జీలిచ్చి తమబోటి వాళ్ళను ఇంతదూరం రప్పించేవాడే కాదు. రప్పించిన తరువాత అడుగులకు

మడుగులొత్తేవాడే కాదు. కరపత్రాలు అచ్చేసి కాళ్ళరిగిపోయేట్టు ఆఫీసులన్నీ తిరిగి పదీ పరకాలెక్కన చందాలు పోగుచేసి, హాలు మాట్లాడి, ఆహ్వానాలు పంచి – అబ్బే! ఈ బాదరబందీ అంతా పెట్టుకొనేవాడు కాదు ఎందుకులెండి! సెక్రెటరీకి బుద్ధిలేదంటూ తమరొక కాగితం పైన రాసి పడెయ్యండి! అతను ఫ్రేము కట్టించి ఇంట్లో తగిలించుకుంటాడు" అనేశాను. ఆహాహా, అప్పు డాయన ముఖం పోయిన పోకళ్ళన్నీ నువ్వు చూసి ఉండాల్సిందోయ్ మూర్తీ! కనుగుడ్లు ముందు కుబికి వచ్చేశాయి. కనుబొమలు ఏటవాలుగా పైకిలేచాయి. నుదుట ముడుతలు పడ్డాయి. బుగ్గలు ఉబ్బిపోయాయి. పెదవులదిరిపోయాయి. అంతటి కోపం మనిషికి రానే రాగూడదయ్యా మూర్తీ! వచ్చిందో ఎంతటి అఘాయిత్యాన్నయినా ఎదురు చూడొచ్చు. సరిగ్గా జరిగిందదే! "ఎవడివయ్యా నువ్వు? ఏమనుకుంటున్నావు? ఎవరితో మాటాడుతున్నావో తెలుసా?" అని రౌద్రంగా గాండ్రిస్తూ ఆయన కాళ్ళు పైకెత్తి బలం కొద్దికీ ఒక్క పెట్టున స్టూలును తన్నేశాడు. పాలగచ్చుపైన అది తల్లక్రిందులుగా పల్టీ కొట్టబోయి గోడ కానించిన సన్మాన పటానికి వెళ్ళి మోదుకుంది. మరుక్షణంలో హాలంతా గాజుముక్కలే! "నువ్వెవరితో మాటాడుతున్నావో తెలుసా?" అన్న గద్దింపు నా చెవుల్లో మారుమ్రోగిపోతూనే వుంది. అప్పుడు నేనేమన్నానో తెలుసా మూర్తీ! "తప్పయితే మన్నించండి సార్! ఒక మనిషి ఇంకొక మనిషితో ఎలా మాట్లాడాలో అట్లాగే నేను మీతో మాట్లాడాను"... అంటూ చల్లగా బయటికొచ్చేశాను!!

శ్రీనివాసమూర్తి దిగాలు పడిపోయాడు. శాస్త్రిగారీ విధంగా రుద్రతాండవం చేయడానికి కారణమేమై ఉంటుందో అతడొక విధంగా ఊహించగలిగాడు. ఆయన తన రేటు అయిదు వేలని ఖరా ఖండిగా తెలియజేశాడు. అయితే, రసతరంగిణి తన స్థితిగతులను బట్టి చంద్రునికొక నూలుపోగుగా మూడు వేలు మాత్రం చెల్లించుకోగలదని శ్రీనివాసమూర్తి సవినయంగా తెలుపుకున్నాడు. ఈ మనవిని లెక్కకు తీసుకుని ఆయన రేటు విషయంలో పునరాలోచించగలడని తానాశించడం పెద్ద పొరపాటైపోయిందని శ్రీనివాసమూర్తి గ్రహించాడు. చాలని దానికి ఈ చంద్రారావొకడు. చూసి రమ్మంటే కాల్చివచ్చినట్టుగా ఆయన్ను బాగా రెచ్చగొట్టి వచ్చేశాడు. ఇప్పుడు గదిలోకి వెళ్ళడమంటే ఆయన కోపాగ్నికి ఇంధనం కావడమన్నమాటే! అయినా, రోటిలో తల పెట్టక తప్పదు.

శబ్దం కాకుండా రెక్క తలుపుల్ని ముందుకు తోసుకుని దొంగలా మెల్లగా లోపల అడుగు పెట్టాడు శ్రీనివాసమూర్తి. దొంగగొడ్డుకు బడితెపూజ చెయ్యగోరి పొంచి ఉండే పొలంకాపులా వేచి ఉన్న శాస్త్రిగారు శ్రీనివాసమూర్తి కనిపించగానే పెట్రేగిపోయారు. "మంచి పనోడివేలే! వచ్చేస్తివా! ఇందాకా నాపైకి తోల్తివే, వారెవడు? ముట్టాళ్, వాడంతా ఎంత? నన్నే సతాయిస్తాడా? నీ మట్టుకు నువ్వు మాత్రం? నేను చెప్పిందేమి, నువ్వు చేసిందేమి? ఇదేం బిచ్చమా బీరకాయ! వద్దొద్దు నువ్వొక పైసా అయినా ఇవ్వొద్దు తీసుకెళ్ళు" అంటూ అరచేతిని టేబిల్ పైన పెట్టి డబ్బున్న కవరును ఒక విసురుతో క్రిందికి తోసేస్తూ ఆయన వడివడిగా పడక గదిలోకి వెళ్ళిపోయారు.

శ్రీనివాసమూర్తి తన పాదాల దగ్గరికొచ్చిపడిన కవరును తీసి పదిలంగా జేబులో ఉంచుకున్నాడు. హాల్లో చెల్లాచెదురుగా పడి వున్న గాజుముక్కలన్నింటినీ ఒక్కటైనా బీరు

పోకుండా ఏరి బయట పారవేశాడు. కారియర్ తీసుకొచ్చి టేబిల్ పైన పెట్టాడు. బోసిపోయిన సన్మాన పటాన్ని చంకలో ఉంచుకున్నాడు. విషాదాంత నాటకాన్ని చూసి నిర్విణ్ణుడైపోయి, ఆలస్యంగా బయటికి వచ్చిన చివరి ప్రేక్షకుడిలా నిద్రలో నడుస్తున్నట్టుగా అడుగులు వేస్తూ గది గుమ్మం దాటి ఈవలికి వచ్చాడు. వసారాలో నుంచి మెట్లు దిగబోతుండగా పైమెట్టుపైన కుప్పుసామి కనిపించాడు.

"నాయనా కుప్పుసామీ! ఉదయం ఎనిమిదింటికల్లా టిఫినొస్తుంది. కారు ఎనిమిదిన్నరకు సిద్ధంగా వుంటుంది. తొమ్మిదింటికే రైలు. నేను స్టేషను కొస్తాను. ఏ కొరతా లేకుండా సాగనంపే పూచీ నాదని అయ్యగారితో చెప్పు. అన్నట్టు కారియర్ టేబిల్ పైన వుంది. భోజనం చెయ్యమని చెబుతావు గదూ?"

'రసతరంగిణి'లో ప్రోగ్రాం ఇచ్చి వచ్చిన కొత్తలో ఒక మాసపత్రిక విలేఖరి ఇంటర్వ్యూ చెయ్యడం కోసం అనంత నారాయణ శాస్త్రిగారితో భేటీ అయ్యాడు. చింతాద్రిపేటలో పాత హవేలీ లాంటి శాస్త్రిగారి సొంత ఇంటిహాల్లో ఇంటర్వ్యూ ఇచ్చేవారు, పుచ్చుకునేవారు ఎదురెదురుగా కూర్చున్నారు. వివిధ సభల్లో, వివిధ సందర్భాల్లో శాస్త్రిగారికి సమర్పించబడిన జ్ఞాపికలతో నిండిన షోకేసులతోనూ, వాటిపైన గోడ ఊనికగా చీలలకు బిగించిన సన్మాన పటాలతోనూ ఆ హాలు ఒక మ్యూజియంలా ఉంది.

పుట్టుక, బాల్యం, విద్యాభ్యాసం, సంగీత శిక్షణ, సాధన, పాల్గొన్న సభలు, ఉత్సవాలు, అందుకున్న గౌరవాలు – ఇలా వివరాలన్నీ నమోదు చేసుకున్న తర్వాత "చెప్పండి స్వామీ! మరేమైనా విశేషాలుంటే చెప్పండి" అన్నాడు విలేఖరి. "కచ్చేరీల కోసం మీరెన్నెన్ని ప్రదేశాలకో వెళ్తుంటారు గదా! అక్కడ మీకెదురయ్యే అనుభవాలను గురించి కూడా చెప్పండి" అంటూ ఒక నిర్దిష్టమైన అంశాన్ని సూచించాడు.

శాస్త్రిగారు ఒక్క పెట్టున గుర్రపు పిల్ల సకిలించినట్టుగా నవ్వేశారు. "పులికి ఏ అడివైతే నేమయ్యా పిచ్చోడా! వాళ్ళెవళ్ళూ నా దగ్గర తోకాడించరు. ఆడించారో కత్తిరించేస్తాను. మొన్నటికి మొన్న ఏమైందో తెలుసునా? ఒక చోట తక్కువ డబ్బిచ్చి నా ముఖానికి మసి పూయాలని చూశారు. నేనాకవరును నేలపైకి విసరి కొట్టాను. ఆ మరునాటి ఉదయం సెక్రెటరీ స్టేషనుకు తలతో నడిచొచ్చి మనకు ఇవ్వవలసిందంతా ఇచ్చేసి చెంపలేసుకున్నాడు. అమ్మో, ఈ కాలంలో నోరుండి బ్రతకాలి, లేకుంటే ఊది పారెయ్యరూ. "ఇంటర్వ్యూ ముగిసింది. బ్యాక్‌గ్రౌండులో కొన్ని మెమెంటోలు, సన్మాన పత్రాలు వచ్చేటట్టుగా ఒకటి రెండు ఫోటోలు తీసుకుంటానన్నాడు విలేఖరి. కోణాన్ని ఎన్నుకోడం కోసం అటూ ఇటూ తిరుగుతూ ఉండి, ఒక చోట తటాలున ఆగి, ఆగిపోయిన వాడు మానసికంగా నివ్వెర పడి పోయి, శారీరకంగా కొయ్యబారిపోయి, కొద్ది నిమిషాల్లో ఎట్లాగో తేరుకుని "ఏమిటి సార్! ఇక్కడ రెండు వాక్యాలు చాలా డామేజింగ్‌గా ఉన్నాయే!" అంటూ తన విస్మయాన్ని వెల్లడించాడు.

"వాక్యాలు డామేజింగ్‌గా ఉన్నాయా?" – శాస్త్రిగారు కళ్ళు పెద్దవి చేసుకుని అతడి వైపు చూశారు.

"ఏం సార్! మీరు వీటిని చదివి చూడరా?" ఇంటర్వ్యూలో అది కూడా ఒక భాగమే అయినట్టు విలేఖరి వాకబు చేశారు.

"ఆ ఓపిక ఎక్కడుంది? అక్కడ వాళ్ళు చదివి వినిపించినప్పుడు వినడమే! ఏదీ, ఎక్కడ?" ఇంకా పాతవాటిలో కలవకుండా, కొత్తదనం వసివాడకుండా ఉన్న ఒక సన్మాన పత్రం చివర అతడు చూపించిన వాక్యాలపైన తన చూపుల్ని తూపుల్లా గుచ్చి చూశారు శాస్త్రిగారు.

"సంగీత విద్వాంసులుగా ఎంతటి గొప్పవారో, మనిషిగా అంతటి హీనులు మీరు. మానవత లేని మేధావులకన్నా మంచితనం కలిగిన మానవులే ఈ సమాజానికి అవసరం..."

"అడె కుప్పుసామీ! వాడా ఇప్పటి! ఇద్దై ఎడుత్తు ఎరుంజుడుడా వెళియే..." (ఒరే కుప్పుసామీ! రారా ఇట్లా! దీన్ని తీసి పారెయ్యరా బయట) అంటూ అరిచారు శాస్త్రిగారు.

'కానీ, వచ్చిన కితాబు ఎక్కడికి పోతుంది?'- అనుకున్నాడు విలేఖరి.

♦ *"ఇండియా టుడే" మాసపత్రిక, 1992* ♦